# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహిళలు కలలు సాకారం చేసుకునేందుకు మనోధైర్యంతో అడుగువేయాలని.. అది దేశ పురోభివృద్ధికి శ్రీకారం చుడుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు.**
2. **రాష్ట్రంలో కుల వృత్తులను ప్రోత్సహించేలా ఆదరణ పథకం అమలుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఆదేశించారు.**
3. **రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంతోపాటు యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటకశాఖ పనితీరు మెరుగవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **ఏడు నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 3లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో పర్యటించనున్నారు.**

==========================

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్వహించిన 10వ అంతర్జాతీయ మహిళా సదస్సును రాష్ట్రపతి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక, క్రీడలు, రాజకీయం, కళలు ఇలా అన్ని రంగాల్లోనూ మహిళలు పురోగతి సాధిస్తున్నారని తెలిపారు. మహిళలు కలలు సాకారం చేసుకునేందుకు మనోధైర్యంతో అడుగువేయాలని.. అది దేశ పురోభివృద్ధికి శ్రీకారం చుడుతుందని రాష్ట్రపతి పేర్కొంటూ..

... వాయిస్ ...36 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన తరగతుల కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆదరణ పథకం అమలుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. అదరణ-3గా దీనిని అమలు చేయనున్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమశాఖలపై సచివాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కులవృత్తికి ఆధునికతను జోడించి పని

సులభతరం చేయడంతో పాటు ఆదాయాన్ని పెంచేలా కొత్త పరికరాలను అందించాలని అధికారులకు సూచించారు. ఎంపిక చేసిన లబ్దిదారులు ఆ పరికరాలను కచ్చితంగా వాడుకుంటూ ఆదాయాన్ని పెంచుకునేలా ఉండాలని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

---------------------------

స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. లక్ష్యాలు పెట్టుకోవడంతోపాటు ప్రణాళికలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంపై నిన్న ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వనరుల సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించే దిశగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల జీవన ప్రమా ణాలు పెంచడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు చేరు కోవడం, పర్యావరణాన్ని కాపాడడమే లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

---------------------------

రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంతోపాటు యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటకశాఖ పనితీరు మెరుగవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పర్యాటకరంగంపై ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ఘనచరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ.. భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటకశాఖను తీర్చిదిద్దాలని సూచించారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలు కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

ఏడు నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 3 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆర్థిక పరిపుష్ఠి సాధించి, మళ్లీ లాభాల బాట పట్టేలా చర్యలు చేపడుతున్నామని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ వివరిస్తూ...

..వాయిస్...36 సెకన్లు....

---------------------------

దేశం, ప్రజలు బాగుండాలని పళని మురుగన్ స్వామిని వేడుకున్నానని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. దక్షిణ భారతదేశ ఆలయాల సందర్శనలో భాగంగా నిన్న ఆయన తమిళనాడులోని మదురై మీనాక్షి అమ్మవారు, సోమసుందరేశ్వరుడిని దర్శించుకున్నారు. అమ్మవారికి సారె సమర్పించారు.

---------------------------

తెలంగాణలో సేంద్రియసాగు పెద్దఎత్తున పెరగాలని, మహిళా సంఘాలను ప్రోత్సహించాలని, పూలు,

పండ్లు, కూరగాయల సాగు విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు..నాబార్డు ప్రాధాన్యపత్రాన్ని నిన్న హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో ఎలా నడుస్తున్నాయో బ్యాంకులు పరిశీలించాలని కోరారు. వ్యవసాయ రంగానికి మరింత రుణసహాయం అందించాలని.. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

-----------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల చదువుతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె ఆదర్శ పాఠశాల ఆవరణలో నిన్న ఆయన విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 90 వేల మందికి సమస్యలున్నాయని గుర్తించామని తెలిపారు. శాసన మండలి ఎన్నికలున్న జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా. కంటి అద్దాలు పంపిణీ చేశామని మంత్రి పేర్కొంటూ..

.....వాయిస్.... 27 సెకన్లు....

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటల 45 నిముషాలకు కందుకూరు చేరుకుని దూబగుంట శివారులోని.. మెటీరియల్ రికవరీ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దూబగుంటలో ప్రజలతో కలిసి పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటుతారు. అనంతరం కందుకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు.

-----------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పని చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిన్న ఆయన కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. జిల్లాలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల వివరాలను ముఖ్యమంత్రికి అందించేందుకు నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.

-----------------------------

గులియన్ బారీ సిండ్రోమ్..జీబీఎస్ సాధారణ వ్యాధేనని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిన్న ఆయన పరిస్థితిని సమీక్షించి, బాధితులను పరామర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పదిమంది జీబీఎస్ బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

======================